క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు



దామెర : ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ విమల హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు గ్రామాల్లో కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. కూలీల సంఖ్య తక్కువగా ఉన్న గ్రామాల్లో పక్క గ్రామాల నుంచి కూలీలు వెళ్లి పనిచేయాలని ఆమె సూచించారు. వీరి వెంట ఏపీఓ శారద, ఈసీ రాజేశ్, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం ప్రమాదవశాత్తు ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు మేడారం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఊరుగొండ వద్దకు రాగానే రహదారి పక్కనే వెళ్తున్న లారీడ్రైవర్ లారీని కారు వైపుగా తిప్పడంతో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కారులో ఐదుగురు ఉండగా ఎవరికి కూడా గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని సంబంధించిన వివరాలను సేకరించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. డీఈఓగా అంకిత, హెచ్ఎంగా రవళిక, మిగతా వారు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయ బోధనా విలువలు అనుభవంలోకి వస్తాయని, అలాగే సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్ సతీష్, కృష్ణమూర్తి, రవి రాజన్న, సుజాత లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఆత్మకూరు : గ్రామాల్లో ఉపాధి హామీ జాబ్ కలి గిన కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి అన్నారు. బుధవారం నాగయ్యపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. కొలతల ప్రకారం పనిచేస్తే సరైన వేతనం వస్తుందని సూచించారు. కూలీలకు ఎండదెబ్బ తగలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. అనంతరం నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఏ, పాల్గొన్నారు.

ఆస్తి పన్ను సకాలంలో చెల్లించాలి



పరకాల : ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్ కోరారు. బుధవారం మున్సి పాలిటీ పరిధిలో జరుగుతున్న ఆస్తి పన్నులను స్వయంగా పరిశీలించడంతో పాటు బకాయిలు ఉన్న ఇంటి యాజమానులతో మాట్లాడారు. మార్చి 31 వరకు బకాయిలు చెల్లించడం వలన పట్టణాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విశాల దృక్పథం కలిగి ఉండాలి

- రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాశ్
- జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'జీవపరిణామం ఆగిందా.. కొనసాగుతుందా' పై చర్చా కార్యక్రమం
- ప్రశ్నలు అడిగిన విద్యార్థులు
- జవాబులు ఇచ్చిన జేవీవీ బాధ్యులు



విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి ధర్మప్రకాశ్

ధర్మసాగర్ : రేపటి పౌరులుగా సమాజాన్ని నిర్దేశించే విద్యార్థుల్లో విశాల దృక్పథం కలిగించాలనే సదాశయంతో జనవిజ్ఞాన వేదిక చర్చా వేదిక నిర్వ స్తున్నట్లు రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాశ్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమంలో భాగంగా జీవ పరిణామం ఆగిందా, కొనసాగుతుందా అనే అంశాలపై స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో చర్చా కార్యక్రమం జరిగింది. విద్యార్థుల ప్రశ్నలకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాష్ జవాబు ఇచ్చారు. జీవ పరిణామం కొనసాగడం విషయంలో విద్యార్థులతో జరిగిన ఈ చర్చ కొన్ని సమాధానాలు ఇచ్చింది. ఈ విషయంపై చర్చలు మరింతగా జరగాల్సి ఉందని జనవిజ్ఞాన వేదిక భావిస్తుంది.



ప్రశ్న : కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి జీవులకు పరిణామం చెందడం నేటికి కొనసాగుతుందా.

– రేణుక 9వ తరగతి

జవాబు : జీవ పరిణామం ఒక నిరంతర ప్రక్రియ. భూమి గ్రహా లు కూడా అలానే ఏర్పడ్డా యి. ప్రాథమిక జీవులు వాటి నుంచి క్రమేణా పరిణామం చెందుతూ విభిన్న వృక్ష జంతుజాలంతో జీవవైవిధ్యం ఏర్పడింది.



ప్రశ్న : జీవులను ఎవరు సృష్టించారు.

– సిద్ధు, 10వ తరగతి

జవాబు : జీవులను ఎవరు సృష్టించలేదు.అవి ఎక్కడి నుంచో ఊడి పడలేదు. పరిణామ క్రమంలో జీవజాలం ఏర్పడింది. న్యాచురల్ సెలక్షన్ అనే ప్రక్రియ ద్వారా మాత్రమే పరిణామం జరిగింది. ప్రకృతిలో ప్రతీ జీవి విపరీతమైన సంఖ్యలో సంతానోత్పత్తి చేస్తుంది.



ప్రశ్న: నాచురల్ సెలక్షన్ అంటే ఏమిటి.దీనిని మనం గుర్తించగలమా.

– లాస్య 8వ, తరగతి

జవాబు : జీవులు ప్రకృతి ఉన్నంత వరకు ఈ నేచురల్ సెలక్షన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. దీన్ని గు ర్తించడం చాలా కష్టం. జీవ పరిణామం ఒక తరం నుంచి మరో తరానికి జరిగేటప్పటికీ ఈ మార్పు నెమ్మదిగా జరుగుతుంది.



ప్రశ్న : కోతి నుంచి మనిషి పరిణామం చెందాడని అంటున్నారు. ఇలానే మనిషి నుంచి మరో కొత్త జీవి ఆవిర్భవించవచ్చా.

– కార్తీక్, 9వ తరగతి

జవాబు : మానవుల తర్వాత ఇంకా ఉన్నతమైన జీవ పరిణామ క్రమంలో ఏర్పడే అవకాశం లేదు. ఎందుకంటే మానవుడు ఇప్పటికే తన విజ్ఞానం ద్వారా భూమి మీద ఉన్నఅన్ని జీవుల మీద ఆధిపత్యం సాధించాడు.



ప్రశ్న : ప్రస్తుతం మానవ ఆవిర్భావంతో పరిణామం ఆగిపోయినట్టేనా, దీనిని ఎలా అర్థం చేసుకోవాలి.

– మధుప్రియ 9వ తరగతి

జవాబు : మనిషి భౌతికంగా పరిణామం ఆగిపోయింది. దీనికి ప్రధాన కారణం మనిషికి సంక్రమించిన శాస్త్రీయ విజ్ఞానం. జీవులు తాము నివసిస్తున్న పరిసరాలకు అనుగుణంగా శరీరంలో మార్పులు చేసుకుంటాయి. ప్రకృతికి అనుగుణంగా ఉండే జీవులు బతుకుతున్నాయి.



ప్రశ్న : ప్రకృతికి అనుగుణంగా మనిషి మారి మరో మెరుగైన ప్రాణి ఆవిర్భావానికి అవకాశం లేదంటారా.

– మనోజ్, 8వ తరగతి

జవాబు : మనిషి తన విజ్ఞానం, ఆలోచనలతో ప్రకృతి మీద విజయం సాధించినందున అతడు ప్రకృతికి అనుగుణంగా మారడు. ప్రకృతినే తనకు అనుగుణంగా మార్చుకుంటాడు. పరిసరాలనే తనకు కావల్సిన పద్ధతిలో మార్పులు చేర్పులు చేసుకుంటాడు.

మహాసభను విజయవంతం చేయాలి

- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం



చేనేత కార్మికులకు మహాసభ కరపత్రాలు పంపిణీ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కమలాపూర్: ఈ నెల 9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుపతలపెట్టిన అఖిల భారత పద్మశాలి మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం పిలుపునిచ్చారు. కమలాపూర్‌లోని చేనేత సహకార సంఘంలో మహాసభ కరపత్రాలను పద్మశాలి సంఘం నాయకులతో కలిసి కులస్తులు, చేనేత కా ర్మికులకు బుధవారం ఆయన పంపిణీ చేసి మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. మహాసభకు పద్మశాలీలు, చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పొరండ్ల కృష్ణప్రసాద్, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ పులికంటి రాజేందర్, నాయకులు వెంగళ వేణుగోపాల్, రమేష్, శంకరయ్య శ్రీకాంత్, రాజు, విజయ, సహదేవ్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ర్యాంకర్‌కు సన్మానం



సిరిసహస్రను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ ఝాన్సీరాణి

కమలాపూర్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) ఇటీవల విడుదల చేసిన సీఏ ఇంటర్ కోర్సు ఫలితాల్లో ఆలిండియా 35వ ర్యాంకు సాధించిన చేరాల సిరిసహస్రను పద్మశాలి కులస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పద్మశాలి కులపెద్దలు సిరిసహస్రను శాలువాతో సత్కరించి అభినందించారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదిగి కమలాపూర్‌తో పాటు పద్మశాలి సామాజిక వర్గానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణిరవీందర్, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్, జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణప్రసాద్, జిల్లా మీడియా కో ఆర్డినేటర్ రాజేందర్, వేణుగోపాల్, రమేష్, శంకరయ్య, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

దేవాదుల పంపుహౌస్ ఎదుట రైతుల నిరసన



దేవాదుల పంప్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులోని దేవాదుల పంపుహౌస్ ఎదుట చలివాగు ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో మైలారం గ్రామ రైతులకు నీరుఅందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని మైలారం రైతులు దేవాదుల గేటు ఎదుట ఆందోళన చేశారు. స్టేషన్ ఘన్‌పూర్, జనగాం ప్రజలకు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఈఎంసీ అధికారి అనిల్‌కుమార్ బుధవారం దేవాదుల ప్రాజెక్టు వద్దకు వచ్చి పంపింగ్ మోటార్లు రెండు నడుస్తున్నాయా లేదా అని పరిశీలనకు వచ్చారు. అదే సమయంలో మైలారం గ్రామ రైతులు దేవాదుల ప్రాజెక్టు పంపుహౌజ్‌కు చేరుకొని ప్రాజెక్టులో నీటి లెవల్ తగ్గిపోతే తమ పంటలకు ఇబ్బంది అవుతుందని తెలుపడంతో ఒక మోటారు బంద్ చేసి ఒక మోటారు నడుపుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జోగంపల్లి దేవాదుల పంపుహౌజ్ నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేసే మోటార్‌ను ఒక బంద్ చేసి ఒకటి నడుపాలని మళ్లీ రెండో మోటార్ ఆన్ చేయవద్దని తెలిపారు. మైలారం రైతుల పంటలకు నీళ్లు అందకపోతే తమ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికి చలివాగు ప్రాజెక్టు కాలువ మరమ్మతు కోసం క్రాప్ హాలీడే ప్రకటించామని తెలిపారు. కార్యక్రమంలో మైలారం గ్రామ రైతులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

వేలేరు : మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు, వేలేరు నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరినట్లు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలేరు నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాలకు నిత్యం టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. వారికి రవాణా సౌకర్యం లేక కాలినడకన వెళ్తున్నారని అన్నారు. అలాగే వేలేరు పీహెచ్‌సీలో గతంలో సబ్ సెంటర్ మంజూరైందని దాని పనులు ప్రారంభించాలని, అలాగే గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేటకు వెళ్లే దారిలో ఉన్న నేరేళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోయిందని దాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన నాయకులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొనగాని రవి ఇంటి నుంచి బొడ్రాయి వరకు 230 మీటర్లు, బొడ్రాయి నుంచి ర్యాకం మొండయ్య ఇంటి వరకు 150 మీటర్లు, గుండు సుధాకర్ ఇంటి నుంచి పీరీల గద్దె వరకు 140 మీటర్ల మేర నూతనంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మండలానికి రూ.1.17 కోట్లు కేటాయించారని, ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసికట్టుగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోట సురేష్, చిట్టి సుందరయ్య, రాజు, సంపత్, సుధాకర్, శ్రీనివాస్, లచ్చన్న, సతీష్, బీఆర్ఎస్ నాయకులు నవీన్‌కుమార్, దేవేందర్‌రావు, సంపత్‌రావు, మొండయ్య, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్

- ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్

దామెర : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్ విద్యార్థులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ జాగృతి దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనన్ భట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆశ చూపించి, డబ్బులు లాక్కుంటున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదివి ఉన్నత స్థానంలో ఉండి తమ తల్లిదండ్రుల కోరికలను నెరవేర్చాలని పేర్కొన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. రహదారి భద్రత నియమాలు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి హెల్మెట్ ధరించి వాహనాలు నడుపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆత్మకూరు: బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కాళీప్రసాద్‌రావు

దామెర : మండలంలోని దుర్గంపేట గ్రామానికి చెందిన ముత్యాల గణేష్ ఇటీవల మృతి చెందగా బుధవారం పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు మధుకర్, చందర్, అర్జున్, అన్వేష్, పరశురాం, సమ్మిరెడ్డి, రవీందర్, శశి, శ్రీనివాస్, కార్తీక్, హరీష్, అజయ్, రాజు, మురళి, శ్రీనివాస్, రాజు, విగ్నేష్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలను బుధవారం బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాద్ పరామర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి శివప్రసాద్, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, తదితరులు ఉన్నారు.

పాతకక్షలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి



గాయపడిన భద్రయ్య

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతనిప్పుల భద్రయ్యపై పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన బొత్త శ్రావణ్ దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్‌కు చెందిన భద్రయ్య వ్యవసాయం చేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. భద్రయ్య గతంలో గోవిందాపూర్ సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించారు. అదే గ్రామానికి చెందిన బొత్త శ్రావణ్ ఎలక్ట్రీషన్ వర్క్ చేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. గతంలో భద్రయ్య కుటుంబానికి శ్రావణ్ కుటుంబానికి ఉన్న పాతకక్షలతో శ్రావణ్ గొడ్డలితో భద్రయ్య భుజంపై దాడి చేశాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. భద్రయ్యకు ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



కమలాపూర్ : విద్యార్థులను స్క్రీనింగ్ చేస్తున్న కళాశాల, పోలీసు సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్ : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షలకు 311 మంది విద్యార్థులకు 296 మంది విద్యార్థులు హాజరయ్యారు. 15 మంది, ఆత్మకూరులో 165 మంది విద్యార్థులకు 162 మంది, కమలాపూర్ మండలంలో 540 మంది విద్యార్థులకు 524 మంది, ఆత్మకూరులో 165 మందికి విద్యార్థులను 162 హాజరైనట్లు హాజరైనట్లు సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు తెలిపారు.

పరకాల : పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



ఆర్టీసీ బస్సులో పరీక్షకు వెళ్లి వస్తున్న విద్యార్థినులు

శాయంపేట : ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులో సురక్షిత ప్రయాణం ఉంటుందని ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాదని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రజని అన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో స్థానిక సోషల్ వెల్ఫేర్ ఇంటర్ విద్యార్థులు పరకాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆర్టీసీ బస్సులో వెళ్లారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా తమ గమ్యాలను చేరాలన్నారు. విద్యార్థులు మంచి మార్కులతో ర్యాంకులు సాధించాలని కోరారు. పరీక్షలు ముగిసేంత వరకు ఆర్టీసీ బస్సులోని తీసుకెళ్లి తీసుకొస్తామని తెలపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

పరకాల: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిరంజన్ మాట్లాడుతూ చెత్త సేకరణలో జాప్యం చేయడంతో దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవికి ముందు నీటి సరఫరా ఇబ్బందిగా మారిన దృష్ట్యా వచ్చే రెండు, మూడు నెలల్లో ప్రజలు మ రింత ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. మాజీ కౌన్సిలర్ పూర్ణాచారి, బీజేపీ పట్టణ నాయకులు భిక్షపతి, విజయ్‌కుమార్, పురుషోత్తం,బూత్ అధ్యక్షుడు సతీష్, దేవేందర్, నరేష్ పాల్గొన్నారు.